మురుగు సమస్య..
5 నెలలుగా ఇబ్బందులు

డ్రైనేజీ పనులు త్వరగా ప్రారంభించాలి

ఏళ్లు గడుస్తున్నా మురుగు నీటి సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఒక వైపు కాలనీల సంఖ్య పెరుగుతుండగా అందుకు తగ్గట్లుగా మౌలిక వసతుల కల్పన జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. కాలనీలు, బస్తీలలో సీసీ, బీటీ రోడ్లు, అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ ,తాగునీటి పైప్‌లైన్‌ తదితర అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా సకాలంలో పనులు పూర్తి చేయలేకపోతున్నారు. దీంతో స్థానికులు అవస్థలుపడుతున్నారు. – మియాపూర్‌



అస్తవ్యస్తంగా మురుగు నీటి కాలువ



- అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పనులకు నెల కిందట శంకుస్థాపన
- ప్రారంభం కాని పనులు
- వెంటనే పైప్‌లైన్‌ పనులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

◆ చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని విశ్వేశ్వర కాలనీలో రోడ్డుపై మురుగు పారుతోంది. సుమారు 5 నెలల నుంచి కాలనీలో ఓపెన్‌ నాలాల నుంచి మురుగునీరు రోడ్లపై పారుతున్నా పట్టించుకున్న వారు లేరు.

◆ కాలనీలోని దేవాలయం, పోలీస్‌ విశ్రాంత గది ముందు మురుగు పారుతుండడంతో గుడికి వెళ్లే భక్తులు, పోలీస్‌ సిబ్బంది మురుగునీటిలో నుంచే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దుర్వాసన వస్తోందని వాపోతున్నారు.

మేయర్‌ ఆదేశించినా..

◆ నగర మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి నెలరోజుల కిందట మియాపూర్‌లో పర్యటనలో భాగంగా విశ్వేశ్వర కాలనీలో నెలకొన్న మురుగు సమస్యను ఎమ్మెల్యే గాంధీ స్థానిక కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు.

◆ ఈ క్రమంలో సమస్య పరిష్కారానికి నిధులు మంజూరయ్యాయి. పైప్‌లైన్‌ పనులకు నెలన్నర కిందట శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పనులను ప్రారంభించలేదు. సుమారు 5 నెలలకు పైగా ఓపెన్‌ నాలాల నుంచి మురుగు బయటకు వస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు వల్ల దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని కాలనీలవాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



కాలనీలో నెల రోజుల నుంచి రోడ్ల పక్కన ఉంచిన పైప్‌లు

నెలల తరబడి రోడ్లపై మురుగు

విశ్వేశ్వర కాలనీలో ఐదు నెలలకు పైగా మురుగు రోడ్లపై ప్రవహిస్తుంది. దుర్వాసన భరించలేకపోతున్నాము. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు పనులను ప్రారంభించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించాలి. – విక్రంరెడ్డి, విశ్వేశ్వర కాలనీ

సమస్యకు శాశ్వత పరిష్కారం

కాలనీలో మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం. కొత్త పైపుల పనులు త్వరలో ప్రారంభిస్తాం. ఆయా శాఖల అధికారుల నుండి అనుమతులు తీసుకున్నాం. పనులను ప్రారంభిస్తాం. – డీజీఎం వెంకటేశ్వర్లు

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



రాయదుర్గం: గౌలిదొడ్డిలో నూతనంగా నిర్మించిన సీతారామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు సోమవారం ముగిశాయి. ఉదయం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్‌ ఎంఐజీ కాలనీలోని రామాలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకట భాస్కర సత్యనారాయణచార్యుల నేతృత్వంలో శ్రీరామచంద్రమూర్తి తిరు కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా చేశారు. భారీగా భక్తులు హాజరై స్వామి వారిని కొలిచారు.

60 టన్నుల ఇసుక స్వాధీనం.. ఒకరి అరెస్ట్‌

గచ్చిబౌలి: అక్రమంగా నిల్వ ఉంచిన 60 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకొని ఒకరిని అరెస్ట్‌ చేసిన సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ వెంకన్న తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బంజారాహిల్స్‌లో నివాసం ఉండే కాసాల సుమన్‌(31) ఖాజాగూడలో అక్రమంగా ఉంచిన ఇసుక డంప్‌ను సోమవారం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా ఇసుకను నిల్వ ఉంచారని, భద్రాచలం నుంచి అక్రమంగా లారీల్లో వచ్చిన ఇసుకను కొనుగోలు చేసినట్లు తెలిపారు. అక్రమ మైనింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని భావించిన నేపథ్యంలో పలు జిల్లాల్లో ఇసుక నిల్వలపై దాడులు చేస్తున్నామన్నారు. నిందితుడు సుమన్‌ను అరెస్ట్‌ చేశారు. దీనిపై విచారణ చేయనున్నారు.

యువకుడి ఆత్మహత్య

మాదాపూర్‌: ఆన్‌లైన్‌ గేమ్‌లలో డబ్బులు పోవడంతో నష్టపోయిన ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. మాదాపూర్‌ సీఐ కృష్ణమోహన్‌ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన సిరిసిపల్లి మోహన్‌ అరవింద్‌కుమార్‌ (22) నగరానికి వలసవచ్చి మాదాపూర్‌లోని ఖానామెట్‌తో ఉంటూ ఓ ప్రైవేట్‌ కంపెనీలో ఆఫీస్‌ బాయ్‌గా పనిచేస్తున్నాడు. గత కొంత కాలంగా ఆన్‌లైన్‌లో గేమ్‌లకు అలవాటు పడిన అతను స్నేహితుల వద్ద అప్పు చేశాడు. అప్పు తీర్చేదారి లేక ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–13లోని అంబేడ్కర్‌ నాలా వద్ద ముగ్గురు యువకులు గంజాయి సేవిస్తుండగా బంజారాహిల్స్‌ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొంతకాలంగా ఈ నాలా వద్ద గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తీసుకుంటున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో దాడి చేయగా జి.మనోజ్‌సింగ్‌, పి.సందీప్‌, జే మహేష్‌ ముగ్గురూ కలిసి గంజాయి సేవిస్తూ పట్టుబడ్డారు. వీరి నుంచి మూడు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఖైరతాబాద్‌ చౌరస్తాలో ఆజం అనే వ్యక్తి నుంచి గంజాయి ప్యాకెట్లు కొనుగోలు చేసినట్లు వీరు వెల్లడించారు. వీరిపై ఎన్‌డీపీఎస్‌ యాక్ట్‌ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. బంజారాహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బంజారాహిల్స్‌: గుట్టుచప్పుడు కాకుండా కొనసాగుతున్న పేకాట శిబిరంపై బంజారాహిల్స్‌ పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. బంజారాహిల్స్‌ రోడ్‌ నంబర్‌–12లోని సయ్యద్‌నగర్‌లో జహంగీర్‌పాషా సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తూ ఈజీ మనీ కోసం అలవాటు పడ్డాడు. కొంతకాలంగా తన గదిని జూద గృహంగా మార్చాడు. అతనితో పాటు అదే ప్రాంతానికి చెందిన సయ్యద్‌ ఆబిద్‌పాషా, మహ్మద్‌ జావీద్‌, ఖాజాపాషా, సయ్యద్‌ అలీ తదితరులు పేకాడుతుండగా పోలీసులు పట్టుకొని అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.17 వేల నగదు సీజ్‌ చేశారు. బంజారాహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌

చందానగర్‌: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సాగుతామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. సోమవారం మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని శ్రీల గార్డెన్స్‌ జయప్రకాష్‌నగర్‌, టీఎస్‌ నగర్‌ కాలనీలలో సుమారు రూ.5.60 కోట్లతో చేపట్టనున్న వరద నీటి కాలువ, సీసీ రోడ్ల పనులకు కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీల గార్డెన్‌ కాలనీలోని వంశీ గెలాక్సీ అపార్ట్‌మెంట్‌ వరకు రూ.18 లక్షలతో సీసీ రోడ్డు, జయప్రకాష్‌ నారాయణ నగర్‌ ప్లాటినం స్కూల్‌ మెయిన్‌రోడ్డు వరకు రూ.42 లక్షలతో సీసీ రోడ్డు, గురునాథం చెరువు నుంచి పటేల్‌ చెరువు వరకు రూ.5 కోట్లతో నూతనంగా వరదనీటి కాలువ పనులు చేపడుతున్నామన్నారు. స్థానిక నాయకులు, కాలనీవాసులు, అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌ జన్మదిన వేడుకలు



మొక్కలు నాటిన శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు

మాదాపూర్‌: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ జన్మదిన వేడుకలను సోమవారం మాదాపూర్‌ అయ్యప్పసొసైటీలో ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్‌ పార్టీ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ కార్యకర్తలతో కలసి మొక్కలను నాటారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి భావితరాలకు మంచి భవిష్యత్తును అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్‌ నాయకులు భిక్షపతి ముదిరాజ్‌, నారాయణరెడ్డి, వసంత్‌, నవీన్‌, సయ్యద్‌, బాబుమియా, రమేష్‌రెడ్డి, నరసింగరావు, గౌస్‌, ఇమ్రాన్‌ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

రాయదుర్గం: మాజీ సీఎం కేసీఆర్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని ఖాజాగూడలోని స్పర్శ్‌ హాస్పిస్‌ ఆస్పత్రిలో సోమవారం క్యాన్సర్‌ రోగులకు పండ్లు పంపిణీ చేశారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్‌ సాయిబాబా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఖాజాగూడలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల సమక్షంలో కేక్‌ కట్‌ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నంరాజు, దారుగుపల్లి నరేష్‌, సతీష్‌ ముదిరాజ్‌, జగదీశ్‌, డాక్టర్‌ సుదర్శన్‌, నారాయణ పాల్గొన్నారు.

గుడిసెల తొలగింపు



గుడిసెలను తొలగింపజేస్తున్న హుడా అధికారులు

చందానగర్‌: మియాపూర్‌ మయూరినగర్‌లో సర్వే నంబర్‌ 159 హెచ్‌ఎండీఏ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి గుడిసెలు వేశారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎండీఏ అధికారి దివ్యరెడ్డి పర్యవేక్షణలో సోమవారం జేసీబీ సహాయంతో గుడిసెలను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. తిరిగి గుడిసెలు వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కూల్చివేతల్లో హుడా అధికారి బాబా, మియాపూర్‌ ఎస్‌ఐ మాణిక్యం, హుడా ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసలను అందజేస్తున్న ట్రస్ట్‌ ఛైర్మన్‌ బద్దం కొండల్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: మదర్‌సేవా సమితి ట్రస్ట్‌ ఆధ్వర్యంలో పాపిరెడ్డినగర్‌ స్కూల్‌ విద్యార్థులకు స్టీల్‌ ప్లేట్లు, గ్లాస్‌లను అందజేశారు. సోమవారం స్కూల్‌ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రస్ట్‌ ఛైర్మన్‌ బద్దం కొండల్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరవచ్చన్నారు. పాఠ్యాంశాలను ఎప్పటికప్పుడు చదవాలని సూచించారు. స్కూల్‌ ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌, ఉపాధ్యాయులు హరీష్‌రెడ్డి, అనిత, కూర్మారావు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 33 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 19 మందికి రూ. 2 వేలు, 14 మందికి రూ. 1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారమందిస్తాం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గ పరిధిలో ఆలయాల అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన మల్లన్నస్వామి, శివాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన, తెల్లాపూర్‌లో బీరప్ప, మల్లన్న స్వామి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవభక్తిని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ సోమిరెడ్డి, నాయకులు బాలాజీ, ఉమేష్‌, బుచ్చిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌ రెడ్డి, గోపాల్‌ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం సీఐటీయూతోనే సాధ్యం

పటాన్‌చెరు టౌన్‌: కార్మికుల సంక్షేమం కేవలం సీఐటీయూతోనే సాధ్యమని సీఐటీయూ జిల్లా కోశాధికారి, కిర్బీ యూనియన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాజయ్య అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో గల కిర్బీ పరిశ్రమలో పరిశ్రమ హెచ్‌ఆర్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రాజ మహేందర్‌, సీఐటీయూ జిల్లా కోశాధికారి, కిర్బీ యూనియన్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రాజయ్య చేతుల మీదుగా 69 మంది కార్మికులకు పర్మినెంట్‌ లెటర్స్‌ అందజేశారు.ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. కిర్బీ పరిశ్రమలో సీఐటీయూ వచ్చిన తర్వాత రెండు దఫాలుగా కొత్తగా కార్మికులకు పర్మినెంట్‌ లెటర్స్‌ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్‌ జనరల్‌ సెక్రెటరీ రాజు, యూనియన్‌ నాయకులు శ్రీనివాస్‌, నాగప్రసాద్‌ ,బిలాల్‌, మహేశ్వర్‌ రెడ్డి, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు కొండాపూర్‌ ఏఈ ఎస్‌.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్స్‌ కాలనీ, గోల్డెన్‌ తులిప్‌ రోడ్‌ నంబర్‌ 1,2,3,4, వెంకటరమణ టాటా మోటార్స్‌ లేన్‌, రాఘవేంద్ర కాలనీ హైటిన్షన్‌ లేన్‌, జేవీజీ హిల్స్‌, శిల్పావ్యాలీ, సెంట్రల్‌ పార్క్‌ ఫేజ్‌–2, మాధవ హిల్స్‌, గాయత్రి లేఅవుట్‌, కాంతి వనం, కామ్లేట్‌ లేఅవుట్‌, మసీద్‌బండ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ ఉండదన్నారు. విద్యుత్‌ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్‌లో..

చందానగర్‌: హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

◆ హఫీజ్‌పేట్‌ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు వరకు ఓల్డ్‌ హఫీజ్‌పేట్‌, సాయినగర్‌, యూత్‌ కాలనీ, వార్డు కార్యాలయం, గ్రీన్‌ బావర్చి ఏరియాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

◆ ఆదిత్యానగర్‌ ఫీడర్‌ పరిధిలో.. ఆదిత్యానగర్‌, ఎస్‌సీబి కాలనీ, ఫ్రెండ్స్‌ ఫంక్షన్‌ హాల్‌ ప్రాంతాలలో..

చందానగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

◆ హఫీజ్‌పేట్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని ఆదిత్య ఇంపీరియల్‌ హైట్స్‌, మార్తాండనగర్‌ ఫీడర్ల పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు మార్తాండనగర్‌, న్యూ హఫీజ్‌పేట్‌, హనీఫ్‌ కాలనీ ఏరియాలలో విద్యుత్‌ ఉండదని ఏఈ దీప్తి పేర్కొన్నారు.

◆ ఆదిత్య ఇంపీరియల్‌ హైట్స్‌ ఫీడర్‌ పరిధిలో.. ఆదిత్య ఇంపీరియల్‌ హైట్స్‌, వినాయకనగర్‌, ప్రకాష్‌నగర్‌ ఏరియాలలో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలో..

చందానగర్‌: వేమనకాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో మంగళవారం విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

◆ పీజేఆర్‌ ఫీడర్‌ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు పీజేఆర్‌ ఏరియా రోడ్డు నంబర్‌ 1,3,5,7,12 ఏరియాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

సివిల్‌ ఇంజనీరింగ్‌ ప్రాముఖ్యతను గుర్తించాలి

మనూలో ఎఫ్‌డీపీ శిక్షణ ప్రారంభం

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ)ని ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఇందులో ఎన్‌ఐటీ, సెంట్రల్‌ యూనివర్సిటీలు, ఐఐటీ, మల్టీనేషనల్‌ కంపెనీల నుంచి 50 మందికి పైగా పాల్గొనగా పలువురు నిష్ణాతులు అవగాహన కల్పించారు. 'మనూ' క్యాంపస్‌లోని పాలిటెక్నిక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్‌ షుగుఫ్తాషాహీన్‌ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ జీవితాలను మెరుగుపర్చడానికి సివిల్‌ ఇంజనీరింగ్‌ ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సివిల్‌ ఇంజనీరింగ్‌ విభాగానికి చెందిన కోఆర్డినేటర్లు డాక్టర్‌ జీనత్‌ఆరా, డాక్టర్‌ మహ్మద్‌ జక్వాన్‌, మనూ పాలిటెక్నిక్‌ వైస్‌ ప్రిన్సిపల్‌ డాక్టర్‌ జంగ్లపల్లి అబ్దుల్‌ రహీమ్‌ పాల్గొన్నారు.

టీఎన్‌జీఓ కాలనీలో కులగణనపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు, అధికారులు

రాయదుర్గం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన రెండవ విడతలో భాగంగా జీహెచ్‌ఎంసీ అధికారులు సోమవారం టీఎన్‌జీఓ కాలనీలో పర్యటించారు. . కాలనీవాసులకు కులగణనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులు మాట్లాడుతూ మొదటివిడతలో మిగిలిపోయిన వారికి మరో విడతలో అవకాశం కల్పించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారికి అందాలంటే వివరాలు ఇవ్వాలన్నారు. జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ ముకుందరెడ్డి, అసిస్టెంట్‌ కమిషనర్‌ ప్రేమ్‌కుమార్‌, టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్‌, మాజీ అధ్యక్షుడు సుధాకర్‌, కె రవీందర్‌రెడ్డి, తెలంగాణ బీసీ కమిషన్‌ సభ్యుడు తిరుమలగిరి సురేందర్‌, మహిళా పెన్షనర్ల సంఘం అధ్యక్షురాలు ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రజావాణి.. 8 ఫిర్యాదులు



ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌ రెడ్డి, అధికారులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటి కమిషనర్‌ ముకుంద్‌ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు 8 ఫిర్యాదులు అందజేశారు. ఇంజనీరింగ్‌ 2, టౌన్‌ప్లానింగ్‌ 3, ఎంటమాలజీ, అర్బన్‌ బయోడైవర్సిటీ, శానిటేషన్‌ విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు చొప్పున వచ్చాయని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్‌, అర్బన్‌ బయోడైవర్సిటీ సర్కిల్‌ మేనేజర్‌ యూసుఫ్‌, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు



జూబ్లీహిల్స్‌ శ్రీవారి ఆలయం

బంజారాహిల్స్‌: ఈ నెల 25వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు జూబ్లీహిల్స్‌ టీటీడీ శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. అత్యంత వైభవంగా తిరుపతిలో నిర్వహించే విధంగా ఇక్కడ కూడా స్వామివారి కైంకర్యాలు, వాహన సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ నెల 25వ తేదీన అంకురార్పణ, 26న ధ్వజారోహణం, పెద్ద శేష వాహన సేవ, 27న చిన్న శేష వాహన సేవ, హంస వాహన సేవ, 28న సింహ వాహన సేవ, ముత్యపు పందిరి వాహన సేవ, మార్చి 1న కల్పవృక్ష వాహన సేవ, సర్వ భూపాల వాహన సేవ, 2న మోహిని అవతారం, గరుడ వాహన సేవ, 3న హనుమంత వాహన సేవ, రథ రంగ డోలోత్సవం, గజ వాహన సేవ, 4న సూర్యప్రభ వాహన సేవ, చంద్రప్రభ వాహన సేవ, 5న రథోత్సవం, అశ్వ వాహన సేవ, 6న చక్రస్నానం, ధ్వజారోహణం నిర్వహిస్తారని తెలిపారు. 7వ తేదీన సాయంత్రం పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ప్రతి రోజూ భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఘనంగా సంత్‌ సేవాలాల్‌ జయంతి

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో సంత్‌ సేవాలాల్‌ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆల్‌ ఇండియా బంజారా సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌, విశ్వవిద్యాలయం వీసీ జానయ్య జయంత్యుత్సవాలను ప్రారంభించారు. విశ్వవిద్యాలయంలో చదువుకుని వ్యవసాయ శాస్త్రవేత్తగా ఎదిగి ఆరు నెలల క్రితం ఖమ్మంలో మృతి చెందిన అశ్విని పేరు మీదుగా ప్రతి సంవత్సరం సేవాలాల్‌ జయంతి రోజు అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు. అవార్డుతో పాటు రూ. 5లక్షల నగదును ఇవ్వనున్నట్లు రాములు నాయక్‌ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్‌ రమేష్‌ నాయక్‌, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారులు చెత్తమయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపల్‌ పరిధిలోని రహదారులు చెత్తకుప్పలకు నిలయంగా మారుతున్నాయి. ఉస్మాన్‌నగర్‌ నుంచి కొల్లూరు వెళ్లే రేడియల్‌ రోడ్డుపై చెత్తచెదారంతో పాటు భవన నిర్మాణ వ్యర్థాలు పేరుకుపోయాయి. అదే విధంగా వెలిమెల నుంచి రింగ్‌రోడ్డు వేళ్లే మార్గంలో రోడ్డు పక్కనే పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. ఈ మార్గంలో అధికారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కొద్ది రోజులుగా రోడ్లపై చెత్త నిండిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



వెలిమెల నుంచి రింగ్‌రోడ్డు వెళ్లే మార్గంలో..